క్లుప్తంగా

రెడ్‌క్రాస్ అభివృద్ధికి కృషి



జేసీ రాహుల్ కుమార్‌రెడ్డికి మొక్క అందజేస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల జిల్లాలో రెడ్‌క్రాస్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని జిల్లా నూతన జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నంద్యాల జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి పాఠశాల, కళాశాలలో జూనియర్ రెడ్‌క్రాస్ క్లబ్‌లు ఏర్పాటు చేసి వారిని భాగస్వాములను చేయడంతో పాటు సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జిల్లా చైర్మన్ దస్తగిరి, ఉస్మాన్‌బాషా, డీఎఫ్ఓ రాజు నాయక్, చైతన్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

24న మండల సర్వసభ్య సమావేశం

శిరివెళ్ల: ఈ నెల 24వ తేదీన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఆదివారం తెలిపారు. ఎంపీపీ నాయక్ వసీం అధ్యక్షతన జరగనున్న సమావేశంలో రెవెన్యూ, విద్యా, వైద్య, తాగు నీరు, గ్రామీణ, పంచాయతీరాజ్, ఉపాధి, సాంఘిక సంక్షేమ శాఖలపై సమీక్ష జరుగుతుందన్నారు. ఎంపీటీసీలు, సర్పంచులు, ఆయా శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు విధిగా హాజరు కావాలని కోరారు.

దొర్నిపాడు: ఈనెల 22వ తేదీన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

నివాళి



రాజీవ్ గాంధీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నంద్యాల(అర్బన్): ఐటీ రంగాన్ని భారత దేశానికి పరిచయం చేసి, యువత రాజకీయాల్లో భాగస్వామ్యం కావాలని 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించిన ఘనత దివంగత ప్రధాని రాజీవ్ గాంధీదే అని ఏపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోహన్ రావు తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ అధ్యక్షుడు చింతలయ్య, విజయలక్ష్మి, ప్రియ, సరిత, సునీత, చాబోలు సలాం, బాలకృష్ణ, రఫి పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడి మృతి



చోళవేటి లక్ష్మీ నారాయణ (ఫైల్)

రుద్రవరం: మండల ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు చోళవేటి లక్ష్మీనారాయణ (84) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. కొద్దిరోజులుగా గుంటూరులో ఉన్న మనువడి వద్ద నివాసం ఉంటున్నాడు. అక్కడి నుంచి మృతదేహాన్ని రుద్రవరం తీసుకొచ్చారు. మృతి వార్త తెలుసుకున్న మండలంలోని ఆర్యవైశ్యులు తరలివచ్చి సంతాపం తెలిపి నివాళులర్పించారు.

ముగిసిన ఆధ్యాత్మిక ప్రవచనాలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని మెయిన్ బజార్‌లో వెలసిన అమ్మవారిశాలలోని గీతా మందిరంలో వారం రోజుల నుంచి ప్రముఖ ఆధ్యాత్మిక గురువు జ్ఞానప్రసాద్ గురూజీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక ప్రవచనాలు ఆదివారం ముగిశాయి. నువ్వు బాగుండాలి-నీ ప్రపంచం బాగుండాలి అనే అంశంపై వారం రోజులపాటు భక్తులకు ప్రవచనాలు వినిపించారు. అనంతరం ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించారు. నిర్వాహకులు భవనాసి వాసు, తిమ్మయ్య, రామకృష్ణ, గాంధీ, అంజి పాల్గొన్నారు.

బస్సుయాత్రను జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): సీపీఐ బస్సు యాత్ర సెప్టెంబర్ 1వ తేదీన నంద్యాల జిల్లాలో ప్రవేశిస్తుందని వ్యవసాయ కార్మికులందరూ ఈ యాత్రలో పాల్గొని విజయవంతతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు కోరారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజాకారిృక వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలన్నారు.అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. నంద్యాల మండల అధ్యక్షుడిగా మద్దిలేటి, కార్యదర్శిగా మహబూబ్ బాషా, సభ్యులుగా మహేష్, సుబ్బరాయుడు, సుంకన్న, రమణ, మోహన్, రాజు, ఈశ్వరయ్య, ముని, ఖాసీంను ఎన్నుకున్నారు.

తరగని అభిమానం.. చెరగని ఆప్యాయత

- మరోసారి వైఎస్సార్‌సీపీపై అభిమానం చాటుకున్న ప్రజలు
- నియోజకవర్గంలో 11 వార్డులు, ఒక సర్పంచ్ ఉప ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసిన అధికార పార్టీ అభ్యర్థులు
- ఫలించని టీడీపీ వ్యూహాలు
- ఐదు వార్డు స్థానాల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు
- ఎన్నికల బరిలో గెలుపొందినవి ఒక సర్పంచ్, 6 వార్డు మెంబర్లు
- అంబరాన్నంటిన సభ్యుల సంబరాలు



ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డితో గెలుపొందిన వార్డు మెంబర్లు, సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆళ్లగడ్డ: 2019 నుంచి వైఎస్సార్‌సీపీ ప్రభంజనం మొదలైంది. నాటి నుంచి జరిగిన ప్రతి ఎన్నికల్లో ప్రజలు ఏకపక్షంగా తీర్పునిచ్చి వైఎస్సార్‌సీపీకే పట్టం కడుతున్నారు. శనివారం జరిగిన పంచాయతీ ఉప ఎన్నికల్లో సైతం అదే తీరు ఫలితాలు పునరావృతమయ్యాయి. దీంతో ప్రజల ఆదరాభిమానులు చెక్కుచెదరలేదని మరోమారు నిరూపితమైంది. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా వారి దుర్బుద్ధిని గ్రహించిన ప్రజలు వారికి ఓటుతోనే బుద్ధి చెప్పారు. చివరకు ఒక్క చోటైనా తమ మద్దతుదారులను గెలిపించుకోవాలని టీడీపీ పన్నిన వ్యూహాలను జనం గుర్తించి మరోసారి కుట్రలను పటాపంచలు చేశారు. గతంలో టీడీపీ గెలిచిన స్థానాల్లో జరిగిన ఉప ఎన్నికల్లో సైతం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా రెపరెపలను నిలువరించలేక పోయారు. నియోజవర్గ వ్యాప్తంగా వివిధ కారాణాలతో ఖాళీ అయిన 1 సర్పంచ్, 12 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ వెలువడగా ఇందులో 1 వార్డు మెంబర్ (గుంప్రమాన్‌దిన్నె) స్థానం ఎన్నిక వాయిదా పడగా 5 వార్డులను వైఎస్సార్‌సీపీ మద్దతు దారులు ఏకగ్రీవంగా గెలుచుకున్నారు. ఒక వార్డులో గ్రామస్తులు అందురూ కలిసి మద్దతు ఇవ్వడంతో ఇండిపెండెంట్

ఆళ్లగడ్డ నియోజకవర్గంలో గెలుపొందిన వైఎస్సార్‌సీపీ మద్దతు వార్డు మెంబర్ల వివరాలు

గ్రామం/మండలం	వార్డు సంఖ్య	వైఎస్సార్‌సీపీ	టీడీపీ ప్రత్యర్థి వార్డు మెంబర్	మెజార్టీ
అర్జునాపురం (దొర్నిపాడు)	01	హుసేన్‌బాషా	శ్రీనివాసులు	32
ఆర్.నాగులవరం (రుద్రవరం)	07	గంధం విష్ణువర్ధన్‌రెడ్డి	----	ఏకగ్రీవం
నర్సాపురం (రుద్రవరం)	10	చిన్న ఓబుళమ్మ	---	ఏకగ్రీవం
పేరూరు (రుద్రవరం)	05	ఆర్పుగాళ్ల లక్ష్మి	దేవికోటి సుబ్బమ్మ	23
యర్రగుంట్ల (శిరివెళ్ల)	08	బాలరంగయ్య	వెంకటసుబ్బయ్య	53
వనికెన్‌దిన్నె (శిరివెళ్ల)	05	సుశీలమ్మ	జిలకర కుమారి	27
హరివరం (ఉయ్యాలవాడ)	05	ముల్లా గౌస్‌బీ	----	ఏకగ్రీవం
నర్సిపల్లె (ఉయ్యాలవాడ)	07	తొగట చౌడమ్మ	---	ఏకగ్రీవం
బ్రాహ్మణపల్లె (చాగలమర్రి)	05	ఆవుల ఓబులేసు	స్వర్ణలత	59
రాంపల్లె (చాగలమర్రి)	03	దస్తగిరమ్మ (ఇండిపెండెంట్)	---	ఏకగ్రీవం
ఎస్.లింగందిన్నె (ఆళ్లగడ్డ)	09	బద్రి శేఖర్	బండి వినోద్‌కుమార్(బీజేపీ)	11

అభ్యర్థి ఏకగ్రీవంగా విజయం సాధించారు. మిగిలిన 1 సర్పంచ్, 6 వార్డులకు ఆదివారం ఎన్నికలు నిర్వహించగా సర్పంచ్ స్థానంతో పాటు 6 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే బారీ మెజార్టీతో ఘన విజయం సాధించారు.

ప్రతిపక్షాలకు చెంపపెట్టు..

ఇటీవల కాలంలో అధికార పార్టీపై అసమ్మతి పెరిగిందని ప్రచారం ఊదరగొట్టారు. అయినా తమ మదిలో ఆ పార్టీకి అభిమానం చెదిరిపోలేదని ప్రజలు ఓటు ద్వారా నిరూపించడంతో టీడీపీ నాయకుల గొంతులో పచ్చి వెలక్కాయపడినట్లయ్యింది. కోటకందుకూరు సర్పంచ్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుతో లక్ష్మీదేవి 420 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. గ్రామాల్లో ఉండే టీడీపీ నాయకులందరూ ఏకమై బీజేపీని పోటీ పెట్టకుండా లోపాయికారి ఒప్పందం చేసుకున్నా ఈ తీర్పు వారికి చెంపపెట్టులా మారింది. ఎంతమంది ఏకమైనా, ఎన్ని కుయుక్తులు పన్నినా ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు పట్టం కట్టారు.

అంబరాన్నంటిన సంబరాలు..

ఉప ఎన్నికల్లో 11 మంది వార్డు మెంబర్లతో పాటు ఒక సర్పంచ్ వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయ ఢంకా మోగించారు. వీరంతా ఆదివారం ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డిని కలిసేందుకు పట్టణానికి రావడంతో పట్టణంలో పండుగ వాతవరణం కనిపింది. ప్రధాన దారుల్లో మోటార్ సైకిళ్ల ర్యాలీతో ఎమ్మెల్యే కార్యాలయం చేరుకుని సంబరాలు చేసుకున్నారు.



హుసేన్‌బాషా, అర్జునాపురం (దొర్నిపాడు)



గంధం విష్ణువర్ధన్‌రెడ్డి, ఆర్. నాగులవరం (రుద్రవరం)



బాలరంగయ్య, యర్రగుంట్ల(శిరివెళ్ల)



సుశీలమ్మ,వనికెందిన్నె (శిరివెళ్ల)



ఆవుల ఓబులేసు, బ్రాహ్మణపల్లె(చాగలమర్రి)



బద్రి శేఖర్, ఎస్.లింగం దిన్నె (ఆళ్లగడ్డ)

రాయపాడు రెండో వార్డు మెంబర్ ఏకగ్రీవం



రామ తులశమ్మ

గోస్పాడు: మండలంలోని రాయపాడు గ్రామ రెండో వార్డు మెంబరు ఎన్నిక ఏకగ్రీవమైంది. గ్రామానికి చెందిన రామ తులశమ్మ వైఎస్సార్‌సీపీ మద్దతు దారురాలుగా నామినేషన్ దాఖలు చేశారు. అయితే అక్కడ ఎవరూ పోటీ చేయకపోవడంతో ఆమె ఎంపిక ఏకగ్రీవమైనట్లు అధికారులు ధ్రువ పత్రం అందజేశారు.



చిన్న ఓబుళమ్మ, నర్సాపురం(రుద్రవరం)



ఆర్పుగాళ్ల లక్ష్మీదేవి, పేరూరు(రుద్రవరం)



ముల్లా గౌస్‌బీ, హరివరం(ఉయ్యాలవాడ)



చౌడమ్మ, నర్సిపల్లె (ఉయ్యాలవాడ)

విజయానికి దారులు చూపిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు ప్రజల మనస్సును చూరగొన్నాయి. గతానికి భిన్నంగా.. కేవలం అర్హత ఆధారంగా పథకాలు మంజూరు చేయడం, ప్రతిపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తలకు సైతం సిఫారుసులు లేకుండా పథకాలు వర్తింపజేస్తుండం ప్రజలను ఆకట్టుకుంది. అలాగే.. ప్రజా ప్రతినిధులు నిత్యం ప్రజల మధ్యలో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుండటం, గతంలో కేవలం ఎన్నికల సమయంలో నాయకులు వస్తుండటంతో విజయాన్ని కట్టబెట్టారు.





నాడు.. అప్పనపల్లె సమీపంలో తెలుగుగంగ కాలువకు గండిపడిన దృశ్యం, నేడు.. గండిని పూడ్చుతున్న దృశ్యం

గండి పూడ్చివేత

రుద్రవరం: మండలంలోని అప్పనపల్లె సమీపంలో తెలుగుగంగ 19వ బ్లాక్ నుంచి నీరు పారే కాలువ కట్టకు పడిన గండిని పూడ్చివేశారు. గత ప్రభుత్వ హయం నుంచి అప్పనపల్లె నుంచి రుద్రవరం వచ్చే తెలుగుగంగ కాలువకు గండిపడి నీరంతా వృథాగా పోయేది. అటువైపు నుంచి దిగువకు సాగునీరు అందక పోవడంతో రైతులు ఇబ్బందులు పడేవారు. గతేడాది రుద్రవరం, కొండమాయిపల్లె, అప్పనపల్లె గ్రామాలకు చెందిన రైతుల చందాలు వేసుకొని గండికి తాత్కలిక మరమ్మతులు చేశారు. అయినా కాలువలో నీటి ప్రవాహ ఉధృతికి కొట్టుకపోవడంతో మళ్లీ గండి పడింది. ప్రస్తుతం తెలుగుగంగ కాలువ ద్వారా సాగునీరు విడుదల చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. వెంటనే కాలువ పరిధిలోని రైతులు జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారుడు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన వారు గండిని పూడ్చి ఆదుకోవాలని ఆదేశించారు. దీంతో తెలుగుగంగ అధికారులు సాగునీరు విడుదల చేసే ఒక్క రోజు ముందుగానే గండిని పూడ్చివేసి సమస్యను పరిష్కరించారు. దీంతో రైతులు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఓటర్ల జాబితా సవరణ 70 శాతం పూర్తి



మాట్లాడుతున్న ఎలక్టోరల్ అధికారి ఎ.శ్రీనివాస్

చాగలమర్రి: మండలంలో ఓటర్ల జాబితా పరిశీలన 70 శాతం పూర్తయ్యిందని, సమాచారాన్ని కంప్యూటరీకరిస్తున్నారని ఈ ప్రక్రియ ఈ నెల 21వ తేదీ నాటికి పూర్తిచేస్తామని ఆళ్లగడ్డ నియోజకవర్గ ఎలక్టోరల్ అధికారి ఎ.శ్రీనివాస్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలు చేపట్టిన ఓటర్ల జాబితా పరిశీలన వివరాలు కంప్యూటర్‌లో నమోదు ప్రక్రియను సోమవారం పరిశీలించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్యక్రమం ద్వారా మండలంలో 52 మంది బీఎల్‌ఓలు పాల్గొని ఓటర్ల జాబితాను ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పరిశీలించారని, వివరాల మార్పుకు సంబంధించి సంబంధిత వ్యక్తితో సంతకం తీసుకుంటారని చెప్పారు. తహసీల్దార్ సుభద్రమ్మ, డీటీ విజయ్‌కుమార్, ఆర్ఐ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

దొర్నిపాడు: మండల ఎరుకలి సంఘం నూతన కమిటీని ఆదివారం ఆ సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారుడు సుబ్బరాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీఎం హెచ్ జమ్ములయ్య ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కేసీ పుల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా వీర మల్లేశుడు, కోశాధికారిగా నడిపి పుల్లయ్య, కార్యదర్శిగా శ్యాం, మహిళా అధ్యక్షురాలు నాగసుబ్బులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యదర్శి సురసుర రామచంద్రుడు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుమారి, నంద్యాల జిల్లా అధ్యక్షుడు రామలింగడు, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లబోతుల క్రిష్ణయ్య పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటి పూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా అందిస్తున్నట్లు ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం రోజుల పాటు సుద్దమల్ల, మాయలూరు ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు, ఇంజేడు, కొండుపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె, అక్కంపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని వివరించారు.

నేడు స్పందన

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు స్పందన కార్యక్రమం నిర్వహిచనున్నట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల పరిధిలో కూడా రోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అయితే సచివాలయాల పరిధిలో సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోతే మండల కేంద్రంలో జరిగే కార్యక్రమంలో అర్జీలు సమర్పించుకోవలసిందిగా కోరారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి

నంద్యాల(న్యూటౌన్): ఇటీవల సర్దుబాటు పదోన్నతులు, బదిలీలు జరిగిన ఉపాధ్యాయులకు వేతనాలు వెంటనే చెల్లించాలని పీఆర్‌టీయూ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారావు కోరారు. స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులకు ఇచ్చే లీడర్ షిప్ ట్రెనింగ్ ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన ఏ జిల్లా వారికి ఆ జిల్లాలోనే నిర్వహించాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సర్దుబాటులో బదిలీపై వచ్చిన వారిని జూనియర్‌గా పరిగణిస్తున్నారన్నారు. అలా కాకుండా సర్వీసు జూనియర్‌ను సర్దుబాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా గౌరవాధ్యక్షుడు భాస్కరరెడ్డి, విజయరావు, నరసింహులు, సుమయూన్, జగదీష్ పాల్గొన్నారు.

ఆళ్లగడ్డలో వైఎస్సార్‌సీపీకి తగ్గని ఆదరణ

- సర్పంచ్, వార్డు ఉప ఎన్నికల ఫలితాలే నిదర్శనం
- ప్రభుత్వ పనితీరుకు ప్రజల మద్దతు
- ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ బలం మరింత పెరిగిందని, అందుకు ప్రస్తుతం వెలువడిన ఫలితాలే నిదర్శనమని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఒక సర్పంచ్, 11 వార్డులకు జరిగిన ఎన్నికల్లో ఒక్క స్థానంలో కూడా ప్రతిపక్షాలు తమ ఉనికిని కాపాడుకోలేకపోయాయన్నారు. ఎన్నికలు జరిగిన అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయం సాధించారంటే ప్రజల అభిమానం ఉంటేనే సాధ్యమన్నారు. అయినా కేవలం మైక్‌ల ముందు ఊగిపోవడం కాదని, అభివృద్ధి చేసి చూపితే ప్రజలు పట్టం కడతారనడానికి ఇవే ఎన్నికల్లో వెలువడిన ఫలితాలు నిదర్శనమన్నారు. కోటకందుకూరులో కేవలం తమ హయాంలో మాత్రమే అభివృద్ధి జరిగిందని టీడీపీ నేతలు గొంతు చించుకొని ప్రచారం చేయడమే కాకుండా, ఎమ్మెల్యే బయట తిరగడం లేదని అవాకులు పేలారని, తాము నిత్యం ప్రజల్లోనే ఉంటున్నామని, గెలుపొందామనే అహంకారం తమకు తలకెక్కలేదని, అందుకే ప్రజల సమస్యల పరిష్కారానికి శ్రమిస్తున్నామన్నారు. తమపై నమ్మకంతో గెలిపించిన కోటకందుకూరు గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామన్నారు. గ్రామానికి ఇచ్చిన హామీలన్నీ రెండు నెలల్లోపు పూర్తి చేసి చూపిస్తామన్నారు. ఇద్దరు వైఎస్సార్‌పీ అభ్యర్థులు పోటీ పడిన చోట ఏదో టీడీపీ అభ్యర్థి చేతిలో తక్కువ ఓట్లు వచ్చినట్లు చూపించడం సిగ్గుచేటన్నారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, సింగం వెంకటేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సునీల్, రామకృష్ణ, కొలిమిబాషా ఉన్నారు.

ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండండి

నంద్యాలటౌన్: విద్యార్థులు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి కామేశ్వర రావు తెలిపారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక వైఎస్సార్‌నగర్‌లోని కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థినులకు దోమల వ్యాప్తి, వాటి వల్ల వ్యాపించే విషజ్వరాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం వల్ల దోమలు వ్యాప్తి చెందవని, తద్వారా అంటు వ్యాధులు, విషజ్వరాలు ప్రబలకుండా ఉంటాయన్నారు. అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే వారికి ప్రత్యేక చికిత్స అందేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి వరప్రపసాద్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటరమణలు మాట్లాడుతూ దోమ తెరలు వాడటం, డ్రైడే పాటించడం వలన దోమకాటు నుండి తప్పించుకోవచ్చాన్నారు. సబ్‌యూనిట్ అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుస్తకాలు, దుస్తుల అందజేత

నంద్యాల(వ్యవసాయం): రోటరీ క్లబ్ నంద్యాల ఆధ్వర్యంలో రెడ్యూస్-రీయూజ్-రీసైకిల్ (ఆర్‌ఆర్‌ఆర్) సేవా సంస్థకు ఆదివారం ఐరన్ ర్యాక్స్, పుస్తకాలు, బట్టలు అందజేసినట్లు అధ్యక్షుడు దండె దస్తగిరి తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోళ్ల జయకృష్ణ, లక్ష్మీకాంత్ రెడ్డి సహకారంతో సంస్థ నిర్వాహకుడు సన్నల సాయిరాంరెడ్డికి అందజేమాని చెప్పారు. క్లబ్ సభ్యులు సుధాప్రసాదరెడ్డి, శ్రీరామ్మూర్తి, కైలాసనాథరెడ్డి, రాజశేఖర్, విజయశేఖర్‌రెడ్డి, భూషణం, మధుసూదన్ పాల్గొన్నారు.









నంద్యాల పార్కు రోడ్డులోని నాగులకట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు, బంగారు పుట్ట వద్ద పూజలు చేసేందుకు బారులుదీరిన భక్తులు , చాగలమర్రిలో నాగదేవతకు చీర, సారె, నైవేద్యాలు సమర్పించి పూజలు చేస్తున్న దృశ్యం, ఉయ్యాలవాడలో పూజలు చేస్తున్న మహిళలు

వైభవంగా నాగులచవితి వేడుకలు



నంద్యాలలోని ఎన్‌జీఓ కాలనీ రామాలయ ఆవరణంలో పుట్టకుపాలు పోస్తున్న మహిళలు



రుద్రవరంలో పుట్టకు పాలుపోసి పూజలు చేస్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): శ్రావణమాసం నాగుల చవితిని పురస్కరించుకొని పట్టణంలోని పలు దేవాలయాల్లోని జంట నాగులకు భక్తులు ఆదివారం ఉదయమే భక్తిశ్రద్ధలతో జలాభిషేకం, పాలాభిషేకం నిర్వహించారు. మహిళా భక్తులు మడిబట్టలతో నాగదేవతలకు పసుపు, కుంకుమలతో అర్చనలు చేసి స్వామి వారికి పత్తి ఒత్తి, చీరలు, నువ్వులపిండి, వడపప్పు, బియ్యపు పిండితో చేసిన సలిపిండిని స్వామి, అమ్మవార్లకు నైవేద్యంగా సమర్పించారు. ఇంటి దేవతలుగా ఉన్నవారు, నూతన దంపతులు పసుపు బట్టలతో స్వామి వారికి పూజలు చేసి పాలుపోశారు. పట్టణంలోని పార్కురోడ్డులో వెలసిన నాగులకట్టలో భక్తులు ఉదయమే స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనలు, హోమాలు నిర్వహించారు. మహిళా భక్తులు ఒకరికొకరు పసుపు కుంకుమలు అందజేసుకున్నారు.

- స్థానిక చెరువుకట్ట వద్ద ఉన్న బంగారుపుట్ట, పాలిటెక్నిక్ కళాశాలలోని మైదానంలో ఉన్న పుట్టలో భక్తులుపంచామృతాభిషేకాలు, సహస్రనామాలు మహామంగళ హారతులు నిర్వహించారు, పార్కు రోడ్డులోని వాటర్ ట్యాంకు వద్ద, సంజీవనగర్ రామాలయంలో, నాగులకుంట రోడ్డులోని నాగలింగేశ్వరస్వామి దేవస్థానం, రోజాకుంటలోని నాగలింగేశ్వరస్వామి దేవాలయంలో, దేవనగర్, వెంకటాచలంకాలనీ, టెక్కె మార్కెట్ యార్డు, మల్లికార్జునస్వామి దేవస్థానం, బయటిపేట ఆంజనేయస్వామి దేవస్థానం, కాళికాంబ దేవాలయాల్లో జంట నాగులకు భక్తులు పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు.

చాగలమర్రి: నాగుల చవిత పండుగ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో నాగ దేవతకు భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక చాగలమ్మ గుడి వద్ద వెలసిన పుట్ట వద్ద భక్తులు నాగదేవతకు చీర,సారె, నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. అలాగే గ్రామ దేవత చాగలమ్మ దేవతకు కూడ భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పుట్టకు పాలు, చెరకు, నైవేద్యాలు సమర్పించి వారి మొక్కులు తీర్చుకున్నారు.

ఉయ్యాలవాడ : మండలంలో వివిధ గ్రామాల్లో నాగులచవితి పండుగను భక్తి శ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. మండల కేంద్రంలో కుందూనది సమీపంలోనున్న నాగులకట్ట, గ్రామంలో వెలిసిన శివాలయం, రామలయం సమీపంలోనున్న నాగదేవతల ప్రతిమలకు నువ్వుల పిండి, సలిపిండి నైవేద్యంగా సమర్పించి మహిళలు పూజలు చేశారు.

శిరివెళ్ల: మండలంలో ఆదివారం నాగుల చవితి పండుగ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శిరివెళ్ల, యర్రగుంట్ల, గోవిందపల్లె, కోటపాడు, బోయలకుంట్ల, మహదేవపురంలలో శివాలయాలల వద్ద ఉన్న పుట్టలు, నాగులకట్ట వద్ద స్వామికి పాలు పోసి మహిళలు పూజలు చేశారు.

రుద్రవరం: మండలంలోని ఆదివారం నాగులచవితి పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని పుట్టలవద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక పడమటివీధిలో వెలసిన నాగులకట్ల, రెవెన్యూ కార్యాలయం వైపు ఉన్న పుట్టల వద మహిళలు పాలను పుట్టలో పోసి పూజలు చేశారు.



దొర్నిపాడులో..

దొర్నిపాడు:మండలంలో నాగులచవితి పర్వదినాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. పుట్టలవద్దకు పాలు, పండ్లు, పిండివంటలు సమర్పించి మొక్కులు చెలించుకున్నారు.

నంద్యాల(అర్బన్): మండలంలోని కానాల, చాబోలు, అయ్యలూరు, పెద్దకొట్టాల, భామరం, పులిమద్ది, పోలూరు, చాపిరేవుల, మిట్నాల తదితర గ్రామాల్లో భక్తులు చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కానాల గ్రామంలో వెలసిన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారికి భక్తులు పుట్టలో పాలు పోసి నైవేద్యాలు సమర్పించారు.